మినుముకు తెగులు...రైతుకు గుబులు

- అదుపులోకి రాని తెగుళ్లు
- వందల ఎకరాల్లో దున్నేసిన రైతులు
- వేల ఎకరాల్లో మినుము పైర్లు నాశనం
- దిక్కు తోచని స్థితిలో రైతన్నలు

గతంలో రైతన్న ఇంట సిరులు కురిపించిన మినుము పంట.. ఇప్పుడు నష్టాలఊబిలోకి నెట్టేస్తోంది. విపరీతమైన తెగుళ్లు ఆశించడం.. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాకపోవడంతో అన్నదాతకు గుబులు పుట్టిస్తోంది. చేసేదేమిలేక కొందరు పైర్లను దున్నేస్తుండగా.. ఆశ చావని రైతన్నలు మాత్రం మరింత అప్పు చేసి మందులు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. – పాములపాడు

మినుము పంటకు ఆశిస్తున్న తెగుళ్లతో రైతన్నకు గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. రబీ సీజన్‌లో మండలంలో మినుము ప్రధాన పంటగా ఉంది. 15 ఏళ్లకు పైగా విపరీతంగా మినుము సాగు చేయడం, గిట్టుబాటు ధరలతో అన్నదాతలు సంతోషాలతో ఉన్నారు. ఈ సంవత్సరం తెగుళ్లు విపరీతంగా ఆశించడం, ఎన్ని పురుగు మందులకు లొంగకపోవడంతో రైతన్నను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఈ ఏడాది మండలంలో 6 వేల ఎకరాల్లో మినుము పైరు సాగు చేశారు. విత్తన రకాన్ని బట్టి పంట కాలం 70–120 రోజుల వరకు ఉంటుంది. విత్తనం వేసిన 20 రోజుల నుంచి వేరు కుళ్లు తెగులుతో పైర్లు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు 600 ఎకరాల్లో రైతులు దున్నేశారు. ఎకరా పంట సాగుకు సుమారు రూ.25 వేల చొప్పున రైతులు ఖర్చు చేస్తున్నారు. 90 రోజులు నిలవాల్సిన పంట 50 నుంచి 60 రోజుల్లోపే ఎండిపోయి దిగుబడుల మీద తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 1 నుంచి 3 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చింది.


సాగులో ఉన్న మినుము పైరు(ఇన్‌సెట్) తెగులు సోకిన మినుము మొక్కలు

ఆశించిన తెగుళ్లు

మినుము పైరుకు వేరు కుళ్లు, కాండపు ఈగ, తెల్లదోమ, బూడిద తెగులు, ఎండు తెగులు, పేను బంక ద్వారా వ్యాపించే సీతాఫలం తెగులు(లేదా) బొబ్బర్ల తెగులు, పల్లాకు తెగులు వంటి విపరీతంగా ఆశించాయి. వీటి నివారణకు కొరాజిన్, రిమాన్, ఫెడిస్టిల్ వంటి చాలా ఖరీదైన మందులను పిచికారీ చేసినా ఫలితం శూన్యమని రైతులు వాపోయారు. తెగుళ్ల ప్రభావంతో ఎకరాకు 10 కిటాళ్లు రావాల్సి ఉండగా 3 క్వింటాళ్ల లోపే దిగుబడులు వస్తున్నాయి. దీంతో అన్నదాతలు నష్టాల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు మండలానికి వచ్చి పైర్లను పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఇలాంటి తెగుళ్లను చూడలేదు



నేను 5 ఏళ్ల నుంచి 10 ఎకరాల్లో మినుము పంట వేస్తున్నాను. ఈ సంవత్సరం వచ్చిన తెగుళ్లు ఎన్నడూ చూడలేదు. ఇంతకు ముందు 10 క్వింటాళ్లకు పైగా పంట వచ్చింది. ఇప్పుడు చెట్లు 50 రోజులకే చచ్చిపోతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడంలేదు.

– అంబయ్య, రైతు, లింగాల

తెగుళ్లు కంట్రోల్ కావడం లేదు



2 ఎకరాల్లో మినుము పంట వేశాను. తెగుళ్లు రావడం, మందులు కొట్టడం సహజమే. కానీ ఈ సంవత్సరం ఎన్ని మందులు కొట్టినా కంట్రోల్ కావడంలేదు. ఈ సంవత్సరం పంట సాగు చేసిన ప్రతి రూపాయి కూడా బూడిదలో పోసిన పన్నీరైంది.

– రామక్రిష్ణ, రైతు రుద్రవరం

రూ.2 లక్షల వరకు నష్టం వచ్చింది



మూడేళ్ల నుంచి ఈ ఏడాదే మినుము పంట వేశాను. 7 ఎకరాలకు గానూ పెట్టుబడుల కోసం ఇప్పటికే రూ.2లక్షల వరకు ఖర్చు చేశాను. పైరు మొక్క దశలో ఉన్నప్పుడే 3 ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. ఉన్న పంటను కాపాడుకుందామని మందులు కొడుతూనే ఉన్నాను.

– స్వామన్న, రైతు పాములపాడు

పంట మార్పిడి చేయాలి



ఏళ్లుగా ఒకే పంట వేయడం వల్ల కూడా ఇలాంటి తెగుళ్లు వస్తాయి. అప్పుడప్పుడూ పంట మార్పిడి చేయాలి. రసాయన మందుల వాడకాన్నీ కూడా తగ్గించాలి. సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

– ఫణీశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి

అధికారులపై ఎంపీపీ ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ

బండి ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధికారులు ఆలస్యంగా రావడంతో ఎం.పి.పి దేరెడ్డి .చిన్న సంజీవ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలని, గ్రామాల్లో దోమల బెడద అధికంగా ఉన్న నేపథ్యంలో అధికారులు తరచూ ఫాగింగ్ చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని సమస్యలపై అధికారులతో చర్చించారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాగాల రమణ, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి పాల్గొన్నారు.

చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా డీసీ రామాంజనేయులు

మహానంది: మహానందిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా మద్దిలేటి స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఎం.రామాంజనేయులును నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తారు.

క్లుప్తంగా

నాటు సారాకు దూరంగా ఉండాలి


చెంచులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌రావు

శ్రీశైలం: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని సీఐ ప్రసాద్‌రావు హెచ్చరించారు. ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక చెంచుగూడేలలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్‌తో కలిసి ఆయన బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మాణిక్యమ్మ శాల చెంచుగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న గిరిజన గూడేలలో నాటు సారా విక్రయాలు, తయారీ తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజనుల నుంచి విల్లంబులు, బాణాలు లను స్వాధీనం చేసుకున్నారు.

చేతిపంపుల ఏర్పాటు

పాములపాడు: మండలంలోని క్రిష్టారావుపేట గ్రామంలో సర్పంచు వరప్రసాద్ మంగళవారం రెండు చేతిపంపులను ఏర్పాటు చేయించారు. ఏళ్ల క్రితం వేసిన చేతిపంపులు తుప్పుపట్టడంతో ప్రజల సౌకర్యార్థం కొత్తగా ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

శనగలో పంట కోత ప్రయోగం

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు పొలిమేరలో సాగైన శనగ పంటలో అధికారులు బుధవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఏఎస్ఓ హనుమంతు, వీఏఏ భావన, వీహెచ్ఏ రోహిత ఉన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

మహానంది: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. గాజులపల్లె, గోపవరం జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల విజయానికి ఉపకరించే వంద రోజుల ప్రణాళిక గురించి ఉపాధ్యాయులతో డీఈఓ చర్చించారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య, హెచ్‌ఎంలు రవణమ్మ, భాస్కర్ ఉన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ


షాప్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన 16వ రేషన్ షాపుపై కర్నూలు విజిలెన్స్ అధికారులు మల్లేశ్వరమ్మ, వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. చక్కెర 143 కేజీలు, కంది పప్పు 203 కేజీలు ఎక్కువగా ఉందని అధికారులు తేల్చారు. రేషన్ షాపు డీలరు ఉమాదేవిపై 6ఏ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మున్నా తదితరులు

ఆత్మకూరు: స్థానిక క్రీడా మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలకు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, రైల్వే నిమ్మి కృష్ణ యాదవ్, తైక్వాండో గౌరవాధ్యక్షులు నాయబ్, సయ్యద్, అసదుల్లా తదితరులు అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ శిక్షకులు వెంకటేశ్వరగౌడ్, అక్బర్, వినోద్, నరసింహా, ఆసిఫ్‌బేగ్, 5వ వార్డు అధ్యక్షులు ఖాజా, ప్రభుత్వ క్రీడా శిక్షకులు దేవానంద్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ


వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న తహసీల్దార్, ఎంవీఐ, షేర్ ది విజన్ సేవా సంస్థ చైర్మన్

ఆత్మకూరు: కరివేన గ్రామ పరిధిలో ఎస్ఆర్ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన మానవతా నిలయం (వృద్ధాశ్రమం)కు షేర్ ది విజన్ ఆధ్వర్యంలో రూ.3 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. తహసీల్దార్ రత్నరాధిక చేతులమీదుగా వృద్ధులకు వాటిని అందించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ గౌరీబాయి

జూపాడబంగ్లా: కొలతల మేరకు పనులు చేసి గరిష్ఠ కూలీని పొందాలని ఏపీఓ గౌరీబాయి ఉపాధి కూలీలకు సూచించారు. బుధవారం మండలంలోని పి.లింగాపురం గ్రామ సమీపంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మస్టర్‌ను పరిశీలించి పనులకు హాజరైన కూలీల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడుతూ క్రమేణా ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉదయం ఆరు గంటల్లోగా పనులు ప్రారంభించి ఎండతీవ్రత అధికం కాకముందే ఇళ్లకు చేరుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 758 మందికి పనులు కల్పించాల్సి ఉండగా 479 మందికి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామాంజనేయులు నాయక్

నందికొట్కూరు: గీత కార్మికులకు కేటాయించనున్న మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ తెలిపారు. బుధవారం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గీత కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దరఖాస్తు చేసుకునే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ, జూపాడుబంగ్లా మండలం పరిధిలో ఈడిగ కులస్తులు రెండు మద్యం షాపులకు, పగిడ్యాల మండలం గౌడ కులస్తులకు కేటాయించినట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం పొందడంలో ఎలాంటి సమస్యలు వచ్చినా, దరఖాస్తు చేయడంలో ఏదైనా సమస్య వచ్చినా 94409 02576 నంబరును సంప్రందించాలన్నారు. ఎవరి ప్రలోభాలకు, బెదిరింపులకు భయపడకుండా నిర్భయంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గీత కులాలు, ఎక్సైజ్ శాఖ పోలీసులు పాల్గొన్నారు.

ఈశ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఈశ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి కార్మికుడికి ఈశ్రమ్ కార్డు ప్రయోజనాలను వివరించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్డు పొందడం ద్వారా కూలీలు ఎక్కడైనా ఉపాధిని సులభంగా పొందవచ్చన్నారు. ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి కార్మికుడికి రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందన్నారు. ప్రమాదానికి గురై మృతిచెందినా, పూర్తి అంగవైకల్యం సంభవించినా రూ.2 లక్షలు, పాక్షికంగా అంగవైకల్యం కలిగితే రూ.లక్ష వరకు బీమా ఉంటుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ పార్థసారథి పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ప్రాక్టికల్, రికార్డుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. బుధవారం స్థానియక యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ సెకండ్ ఇయర్ సైన్స్ విద్యార్థుల నుంచి ప్రాక్టికల్, రికార్డు వెరిఫికేషన్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,000 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై ఆర్ఐఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, విద్యా శాఖ ఉన్నతాధికారులైనా స్పందించి విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు మహబూబ్, గణేష్, జగదీష్, శ్యాంనాయక్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పాములపాడు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నరసింహనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. బడ్జెట్ పెంచకుండా ఉపాధి కూలీలకు పని దినాలు ఎలా పెంచుతార ని ప్రశ్నించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేవన్నారు. స్వామినాథన్ సిఫారసు మేరకు అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్ కాపీల ప్రతులను తగలబెట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగస్వామి, ఆనంద్, ప్రజా సంఘాల నాయకులు అంకన్న, రమేష్ పాల్గొన్నారు.


పాములపాడులో బడ్జెట్ కాపీలను తగలబెడుతున్న రైతు సంఘం నాయకులు



నందికొట్కూరులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రైతులకు తీరని అన్యాయం

నందికొట్కూరు: కేంద్ర బడ్జెట్‌లో రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, బడుగు బలహీన వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు ఎదుట కేంద్ర బడ్జెట్ కాపీ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, కర్ణ, ఓబులేసు, ఉస్మాన్‌బాషా, జయరాణి, బాలస్వామి, కృష్ణ, సీతారాముడు, నాగరాజు, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మూర్తుజావలి పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు: మండలంలోని సింగవరం గ్రామంలో సీఐటీయూ నాయకులు బుధవారం కేంద్రప్రభుత్వ బడ్జెట్ ప్రతులను తగలబెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు యేసురత్నం, కార్మిక సంఘం నాయకులు ఏసేపు, రమేష్, కనకరాజు, పెద్దయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: కేంద్ర బడ్జెట్ రైతులకు ఉపయోగకరంగా లేదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, రైతు సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు మాబాషా, వీరన్న అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నిరసన తెలియజేస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

23న శ్రీశైలానికి సీఎం చంద్రబాబు

శ్రీశైలంటెంపుల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 23న శ్రీశైలం రానున్నారు. సీఎం శ్రీశైలం పర్యటనను ఖరారు చేస్తూ బుధవారం ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈనెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించేందుకు సీఎం శ్రీశైలం రానున్నారు. ఈనెల 23న సాయంత్రం 6.30 గంటలకు పట్టువస్త్రాలు సమర్పించి స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారు. అనంతరం రాత్రి ఇక్కడే బస చేసి 24న ఉదయం విజయవాడకు బయలుదేరుతారు.

65 యూనిట్ల మంజూరు

వెలుగోడు: మండలానికి 2024–2025 సంవత్సరానికి గానూ 65 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 55, కాపులకు 4, ఈబీసీలకు 6 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 21 నుంచి 60ఏళ్లలోపు వారు ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధి కల్పనపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ డైరెక్టర్ ఎస్.గ్రిప్ గిరిజనులకు పథకాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో 35 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25 శాతం సబ్సిడీతో సేవా రంగంలో రూ.25 లక్షలు, తయారీ రంగంలో రూ.50 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుని పరిశ్రమలను ప్రారంభించుకోవచ్చన్నారు. సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి, ఏపీఎం మధు, ఖాదీబోర్డు అధికారి చిన్నరాజు, ఎస్‌బిఐ, కెనరా, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడొద్దు

శ్రీశైలంప్రాజెక్ట్: వాహనాలను అత్యంత వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడొద్దని సున్నిపెంట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా సూచించారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన రహదారి భద్రత మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనాలను యువకులు అత్యంత వేగంతో నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

శ్రీశైలంటెంపుల్: భక్తులకు మెరుగైన సేవలందించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సత్రాల నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక సత్రాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న కారణంగా సత్రాల నిర్వాహకులు అదనంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ సత్రాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలన్నారు. అనంతరం ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ భక్తులకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

కొత్తపల్లి: నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ ఎం.కేశవ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని దుద్యాల గ్రామం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి వాహనదారులైనా నంబర్ ప్లేట్ లేకుండా తిప్పరాదన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహ దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన 9 మంది వాహనదారులకు రూ.1,215 జరిమానా విధించారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ కార్యాలయం నుంచి గౌడ్ సెంటర్, కొత్త బస్టాండు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రత్నరాధికకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు, రైతులకు ఇబ్బందులు కలిగించేటువంటి చట్టాలను తీసకొచ్చిందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి ఇబ్బందులకు గురి చేయాలని చూడడం సరైనది కాదన్నారు. అసంఘటిత రంగ కార్మికలుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నా రు. రవాణా రంగం ప్రైవేటీకరణ ఆపాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు పెద్ద నాగరాజు, గౌడుగరాజు, మల్లయ్య, సామేలు, సువర్ణమ్మ, భారతి, వరలక్ష్మి, రోషన్, రఫీ, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాబాషా, వీరన్న పాల్గొన్నారు.

వెలుగోడు: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల నాయకులు మహమ్మద్ రఫీ, నాగమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాల్లో పనిచేసే వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలంప్రాజెక్ట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని సీఐటీయూసీ జిల్లా నాయకులు మునిపాటి చిన్నమారెన్న అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నల్ల చట్టాలు అమల్లోకి వస్తే కార్మికులపై పని భారం పెరుగుతుందని, ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో సీఐటీయూసీ నాయకులు బి.చిన్నమనెయ్య, ఎం.బాలరాజు, పి.పోలయ్య, గాలెయ్య, భీమలింగడు, మురళి, మౌలాలి, మనోహర్, గంగులు, వెంకటేశ్వర్లు, ఎల్లస్వామి పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు: మండలంలోని వేంపెంట చెంచు గిరిజన గూడెంలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జన జాతి ఆదివాస్ నివాస్ యోజన పథకం నిధులు రూ.55 లక్షలతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా తాము ఏళ్లుగా గుడిసెల్లో జీవనం సాగిస్తున్నామని ఇళ్లు నిర్మించి ఇవ్వాలని చెంచు గిరిజన మహిళలు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సర్పంచు మాణిక్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగలక్ష్మమ్మ, తహసీల్దార్ సుభద్రమ్మ, డాక్టర్ నాగలక్ష్మి, ఐటీడీఏ డీఈ రియాజ్, ఏఈ ప్రదీప్, ఏపీఓ నాగార్జున పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

కొత్తపల్లి: గిరిజనులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం శివపురం గూడెంలో ఐటీడీఏ డీఈ షేక్ రి యాజుద్దీన్, గోకవరం వైద్యుడు విజయేంద్రల ఆధ్వర్యంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. రూ.55 లక్షల వ్యయంతో గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు భవనం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి, ఐటీడీఏ ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.

'పోతిరెడ్డిపాడు' పనుల పరిశీలన

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ విస్తరణ పనులను ఎమ్మెల్యే జయసూర్య బుధవారం పరిశీలించారు. ఎస్సారెమ్సీ 16.5 కిలోమీటర్ల విస్తరణ పనులకుగాను మూడు కిలోమీటర్లు పూర్తికాగా బెడ్‌లెవెల్ 6 కిలోమీటర్లు పూరైనట్లు ఈఈ పార్థసారథి, డీఈ నాగేంద్రకుమార్ ఎమ్మెల్యేకు వివరించారు.